క్లుప్తంగా

అష్టోత్తర శతకలశాభిషేకం



మహబూబాబాద్ రూరల్: అనంతాద్రి శ్రీవారి అష్టా దశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వయంభూ జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అష్టోత్తర (108) శతకలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, జ్యోతి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు కలశాలను తలపై తీసుకొచ్చి అర్చకులకు సమర్పించగా వారు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: నేటి నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మహిళా కౌన్సిలర్లు, మెప్మా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మట్లాడుతూ.. బుధవారం రోజున అజరయ్య ఫంక్షన్ హాలులో, 9న క్రీడా ప్రాంగణంలో, 10న మున్సిపల్ కార్యాలయంలో, 11న ఎస్సీ బీసీ కాలనీలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరి పంటలను కాపాడాలి

గార్ల: పాకాల ఏటికి శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేసి రైతుల వరి పంటలను కాపాడాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోత్ సురేష్‌నాయక్ జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ కెనాల్ నీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో అనిల్ నాయక్, పవన్‌నాయక్, రమేష్‌నాయక్, శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభ బండ్ల మహోత్సవం



డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో మంగళవారం శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి ప్రభ బండ్ల మహోత్సవం ఘనంగా జరిగింది. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు ప్రభలను ఏర్పాటు చేసి ఊరేగింపులో పాల్గొని తిరుపతమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

షబేబరాత్ వేడుకలు

డోర్నకల్: స్థానిక ఉస్మానియా మసీదులో మంగళవారం ముస్లింలు షబేబరాత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఖబ్రస్తాన్‌కు వెళ్లి తమ పూర్వీకులకు శ్రద్ధాంజలి ఘటించారు. మసీదులో ప్రార్థనల సందర్భంగా మత పెద్దలు పండుగ ప్రాధాన్యత గురించి వివరించారు.

సడలని ధైర్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఎంత కష్టం వచ్చినా వెరవక ముందుకు సాగుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..




ఒకే ఠాణాలో కొలువు..



దంతాలపల్లి: మండలం రేపోని గ్రామానికి చెందిన రేజెల్లి సోములు–నాగమ్మ దంపతులకు ఐదుగురి ఆడపిల్లలు. వృత్తిరీత్యా నాటువైద్యం చేస్తూ పిల్లలను పెంచాడు. ఈక్రమంలో అనారోగ్యంతో ఒక కూతురు మృతి చెందింది. కాగా బిడ్డల ఉన్నత చదువుల కోసం కొన్నేళ్ల క్రితం తొర్రూరుకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వీరి మూడో కూతురు జ్యోతి 2014లో సివిల్ కానిస్టేబుల్ జాబ్ సాధించింది. జ్యోతి సోదరి గౌతమి సైతం బీఫార్మసీ చదువుతూనే కానిస్టేబుల్ కొలువు సాధించింది. ప్రస్తుతం వీరిద్దరు దంతాలపల్లి ఠాణాలో ఒకేచోట కొలువు చేస్తున్నారు. వారిని చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కవోని ధైర్యం



గార్ల: భర్త చనిపోయినా మొక్కవోని ధైర్యంతో ముస్లిం మహిళ జమీల సైకిల్‌పై పోస్ట్ ఉమెన్ వృత్తి నిర్వహిస్తూ తన ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు ఇంజనీరింగ్ చదివించి సమాజంలో పలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. గార్లకు చెందిన జమీల భర్త ఖాజామియా పోస్టుమ్యాన్‌గా పనిచేస్తూ గత 16 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త ఉద్యోగం జమీలకు వచ్చింది. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తూ సమాజంలో శభాష్ అనిపించుకుంటుంది. పోస్టుఉమెన్ వేతనం పెంచి, రెగ్యులర్ చేయాలని జమీలా పోస్టల్‌శాఖను వేడుకుంటుంది.

ఆత్మస్థైర్యంతో ముందుకు..



డోర్నకల్: ఈ ఫొటోలో కనిపిస్తున్న భవన నిర్మాణ కార్మికురాలి పేరు ఎస్‌కె రసూల్‌బీ. డోర్నకల్‌లోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటుంది. 22 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో భవన నిర్మాణ కార్మికురాలిగా మారి కూలి పనులు చేస్తూ తన కుమారుడు, కూతురును పోషిస్తూ జీవనం సాగిస్తోంది. భర్త చనిపోయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా తన ఇద్దరు పిల్లల్ని పెంచి పెళ్లిళ్లు చేసింది. ఇతరులపై ఆధారపడకుండా కూలి పనులు చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఉన్నతులుగా..



పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన బోనగిరి లింగమూర్తి–శాంత దంపతులకు దివ్య, విద్య, కావ్య ముగ్గురు సంతానం. గ్రామంలో గుంట భూమి లేదు. రెక్కాడితేనే పూట గడిచే పరిస్థితి. పేదరికంలోనూ బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కూతురు ఎంఏ బీఈడీ చేసి ఉపాధ్యాయ కొలువు సాధించి కన్నవారి కలలను నిజం చేసింది. మిగిలిన ఇద్దరు కూతుళ్లు సైతం ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసి ఉద్యోగ సాధనకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

కష్టాలను అధిగమించి..

- కలలు సాకారం చేసుకున్న మహిళలు
- జిల్లా పాలనలో తమదైన ముద్ర

కలలు కన్నారు.. వాటిని సాకారం చేసుకున్నారు. ఈక్రమంలో ఎన్నో కష్టాలను అధిగమించారు. తల్లిదండ్రులు, బంధువుల సహకారంతో జిల్లాలో ఉన్నత పదవులు చేపట్టి ఉత్తమ పాలన సాగిస్తున్నారు. తమ కంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. రాజకీయ, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - సాక్షి, మహబూబాబాద్

పోటీపడి చదివాం..



నాన్న రఘుపతిరావు రిటైర్డ్ పోలీస్ అధికారి, అమ్మ అనసూర్య గృహిణి. మేం ఐదుగురం సంతానం. ముగ్గురు అక్కలు, ఒక తమ్ముడు. చదువు విషయంలో నాన్న మాకు మార్గదర్శకంగా ఉండేవారు. చదువుతో పాటు ఉద్యోగం కోసం కూడా పోటీ పడ్డాం. ఇప్పుడు ఇద్దరు అక్కలు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఒక అక్క ఉస్మానియాలో అధ్యాపకురాలు, తమ్ముడు సాఫ్ట్‌వేర్, నేను తహసీల్దార్. ఇలా అందరం కష్టపడ్డాం.. జీవితంలో స్థిరపడ్డాం. ఆడవాళ్లమని వెనకబడి ఉండకూడదు. చాలెంజ్‌గా తీసుకోవాలి. అనుకున్న లక్ష్యాలను సాధించాలి.

- నాగభవాని, తహసీల్దార్, మహబూబాబాద్

చిన్ననాటి కల చిన్నమ్మ సహకారంతో నెరవేరింది



చిన్ననాటి నుంచి ఇంట్లో చిన్నమ్మ(మంత్రి సత్యవతి రాథోడ్)ను అనుసరిస్తూ ఉండేదాన్ని. ఆమెను చూసినప్పుడల్లా రాజకీయాల్లో రాణించాలని కోరిక ఉండేది. కానీ పెద్ద పెరిగిన తర్వాత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లాను. అయితే అనుకోకుండా రాజకీయాల వైపు రావాల్సి వచ్చింది. చిన్ననాటి కల చిన్నమ్మ సహకారంతో నెరవేరింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం రావడం సంతోషంగా ఉంది. గిరిజన బిడ్డగా ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నా. ముఖ్యమంత్రి అందించే సంక్షేమ ఫలాలు వారికి చేరవేరుస్తున్నా. ఇంత కంటే ఇంకేం కావాలి.

- ఆంగోతు బిందు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

నాన్నే ఆదర్శంగా ఉద్యోగం



నాన్న రాజం రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అమ్మ కళావతి గృహిణి. మేం మొత్తం ఎడుగురం సంతానం. ఇద్దరు అక్కలు, ఒక చెల్లి, ముగ్గురు అన్నదమ్ములు. అన్న న్యాయవాది, మిగిలిన వారు వ్యాపారంలో స్థిరపడ్డారు. నేను మాత్రం మొదటి నుంచి ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలనే పట్టుదలతో ఉండేదాన్ని. నా ఆలోచనను గమనించిన నాన్న గ్రూప్స్ రాసేలా ప్రోత్సహించారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉద్యోగంలో చేరాను. నాకు ఉద్యోగం వచ్చిన రోజు అమ్మానాన్న కళ్లల్లో ఆనందం నేటికీ గుర్తు చేసుకుంటాం.

- రమాదేవి, జెడ్పీ సీఈఓ

వైవీ ఆశయ సాధనకు కృషి



స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తొర్రూరు రూరల్: సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, నిరంతరం నిరుపేదల పక్షాన పోరాటం చేసి అమరుడైన యనమాల వెంకటయ్య(వైవీ) ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలగిరి గ్రామంలో వైవీ ప్రథమ వర్ధంతి సభను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఆవిష్కరించి, అనంతరం సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకుబ్ అధ్యక్షతన జరిగిన సభలో నాగయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి వామపక్ష ఉద్యమాల వైపు వెళ్లి ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం, డీవైఎఫ్‌ఐ యువజన సంఘంలో పని చేస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయికి ఎదిగి సీపీఎం పార్టీలో కీలకనేత పని చేశాడన్నారు. ఇలాంటి నాయకుడు లేకపోవడం సీపీఎం పార్టీకి, అన్నివర్గాల నిరుపేద ప్రజలకు తీరని లోటన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ధర్మరావు శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, రైతు బంధు మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, వెంకట్రాములు, అల్వాల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రెడ్యాలలోని ఆశ్రమ పాఠశాలలో అవినీతి అక్రమాలకు పాల్పడిన హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ.. రెడ్యాల ఆశ్రమ పాఠశాలలో గిరిజన, లంబాడ, కోయ పిల్లలు చదువుతున్నారన్నారు. వారికి మెనూ ప్రకారం కాకుండా దానికి విరుద్ధంగా హాస్టల్‌లో ఉండే అన్ని వస్తువులను బయటకు పంపిస్తూ పిల్లలకు అన్యాయం చేస్తున్నారు. డైలీ వేజ్ వర్కర్లకు నెలవారీ జీతాలకు బదులు బియ్యం బస్తాలు ఇచ్చేస్తున్నారని, అదేవిధంగా హాస్టల్లో ఉండే వంటకు కావలసిన అన్ని సరుకులు బస్తాలలో ప్యాక్ చేసుకుని ఆటోలలో తరలిస్తున్నారు. పిల్లలకు ప్రతి ఆదివారం అల్పాహారం ఇడ్లీ ఇప్పటి వరకు పెట్టకపోవడం చాలా అన్యాయమన్నారు. అక్రమ అవినీతి విషయాలు బయటకు రానివ్వకుండా పిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, పాఠశాల హాస్టల్లలో ఉండే కేవలం లీడర్లకే ప్రాధాన్యమిస్తూ మిగతా పిల్లలందరికీ గాలికి వదిలేస్తున్నారు. హాస్టల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి ఏ విధంగా హాస్టల్ వార్డెన్ బాధ్యతలు ఇస్తారని ప్రశ్నించారు. ఈ విధంగా పిల్లల పొట్ట గొడుతూ తాను సంపాధించుకుంటున్న వార్డెన్ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు ధారావత్ రమేష్ నాయక్. శ్రీను నాయక్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

నేడు అనంతాద్రిలో శ్రీవారి కల్యాణం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని అనంతాద్రి శ్రీవారి అష్టా దశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వయంభూ జగన్నాథ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం బుధవారం ఉదయం 10గంటలకు అత్యంత వైభవోపేతంగా జరుగుతుందని ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్‌కుమారాచార్యులు మంగళవారం తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబాబాద్ రూరల్: ఆడపిల్ల అంటే అమ్మకు ప్రతిరూపం అని.. అమ్మే సృష్టికి మూలం అంటూ.., మెరుగైన సమాజం కోసం అమ్మను గౌరవిద్దాం.. కాపాడుకుందాం.. అనే నినాదంతో సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ వ్యవస్థాపకులు, చంచల్ గూడ సెంట్రల్ జైలు ఎస్పీ నవాబ్ శివకుమార్ గౌడ్, వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం గ్రూప్4 స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన మాదగాని ఉప్పలయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మంగళవారం మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన కవి చిర్ర సతీష్ బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం, 10కేజీల బియ్యం అందజేశాడు.

ఆర్థికసాయం అందించాలి

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండపెల్లి సత్యంకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర వెంకన్న గౌడ్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వృత్తిలో భాగంగా ఇటీవలే తాటి చెట్టుపైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయాల పాలైనట్లు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలసిన కోరిన కోర్కెలు తీర్చే శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. డప్పువాయిద్యాలతో వేదపండితులు గ్రామంలో తిరుగుతూ తలంబ్రాల బియ్యంను వసూలు చేసి కల్యాణ మహోత్సవానికి తీసుకెళ్లారు. వేంకటేశ్వరస్వామి సహిత పద్మావతి, అలువేలు మంగమ్మతో కల్యాణంను వైభోవంగా చూడముచ్చటగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహంలను పల్లికిలో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మోశారు.కార్యక్రమంలో చైర్మన్ బొల్లం రమేష్, కాలసాని దామోదర్‌రెడ్డి, టేకుల యాధరిరెడ్డి, సర్పంచ్ వేముల రజిత, ఎంపీటీసీ అనురాధ, కర్ల నాగన్న, బండి రమేష్, రవీందర్ రెడ్డి, ఈఓ వేణు, అయూబ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణం

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి రెవెన్యూ పరిధిలోని సుప్రసిద్ధ స్వయంభుగా వెలిసిన శ్రీ మేడాలమ్మ కేతమ్మ సమేత శ్రీ మల్లికార్జునస్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య నిర్వాహకులు, క్లాస్–1 కంట్రాక్టర్ రామడుగు అచ్యుత్‌రావు–సునీత దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు మహాఅన్నదానం చేశారు.

కంఠమహేశ్వరుడికి జలాభిషేకం



పూజలో పాల్గొన్న గౌడ కులస్తుల

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో మంగళవారం కంఠమహేశ్వరస్వామి ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం చేశారు. గ్రామ శివారు తాటివనంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయంలో గౌడ కులానికి చెందిన మహిళలు గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం నిర్వహించారు. బుధవారం బోనాల కార్యక్రమం నిర్వహించనున్నారు.

అంబరాన్నంటిన హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ పండుగ వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. యువకులు, యువతులు, చిన్నారులు, మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మానుకోటలో హోలీ ఆడుతున్న నాయకులు



డోర్నకల్: యాదవనగర్‌లో..



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో హోలీ ఆడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



నెహ్రూసెంటర్: చిన్నారులు, యువకులు



తొర్రూరు రూరల్: గుర్తూరులో..



కలెక్టరేట్‌లో హోలీ సంబురాల్లో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



మహబూబాబాద్ అర్బన్: హోలీ అడుతున్న మహిళలు



మరిపెడ రూరల్: తండధర్మారంలో వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ అరుణ



మానుకోటలో చిన్నారుల హోలీ..



కేసముద్రం: హోలీ వేడుకల్లో చిన్నారులు



బయ్యారం: హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

క్రైం కార్నర్..

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

కేసముద్రం: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గట్టిగొర్ల మహేందర్(30) 6నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కడుపునొప్పిని భరించలేక, తన పంటపొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. పొలం వద్దకు వెళ్లిన మహేందర్ తిరిగి ఇంటికి రాకపోవడంతో, తండ్రి సోమయ్య వెళ్లి చూడగా, కొడుకు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో ఆ తండ్రి బోరున విలపించాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. కాగా మృతుడికి భార్య నవ్య, కుమారుడు శివత్రిశూల్ ఉన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామ శివారులో అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయని రూరల్ ఎస్సై అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు. సికింద్రాబాద్ తండ గ్రామానికి చెందిన బానోత్ సరోజ, ఆమె కుమారుడు మదన్ మిర్చి కల్లం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా గూడూరు వైపు నుంచి ఓ కారు అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. టౌన్ పోలీసులు కారును నర్సంపేట బైపాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. సరోజ భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బయ్యారం: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని కిష్టాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాణోత్ కల్యాణ్(20) డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు నాను–భారతి కుటుంబపోషణ నిమిత్తం హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తుండగా సోదరుడు పవన్‌తో కలిసి కల్యాణ్ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు కొనప్రాణాలతో ఉన్న కల్యాణ్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

తల్లిపై కూతురు ఫిర్యాదు

చిన్నగూడూరు: తల్లిపై కన్న కూతురే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని దూమ్యా తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉగ్గంపల్లి శివారు దూమ్యా తండాకు చెందిన ఆంగోత్ సంధ్య, అదే తండాకు చెందిన గుగులోతు రాజేష్‌కు 3నెలల క్రితమే ఇరువర్గాల పెద్ద మనుషులు ప్రేమ వివాహం జరిపించారు. సంధ్య తల్లి విజయ పిలుపు మేరకు పుట్టింటికి వెళ్లింది. మరిపెడలో ఉన్న అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్దామని తల్లి విజయ కూతురితో నచ్చజెప్పి మంగళవారం తెల్లవారుజామున ఆటో ఎక్కించుకుని అపహరించేందుకు ప్రయత్నించింది. మరిపెడ వెళ్లే మార్గమధ్యలో ఎల్లంపేట నుంచి విస్సంపల్లి వెళ్లే రహదారికి ఆటో మళ్లించడంతో అనుమానంతో సంధ్య ఆటో ఆపేందుకు ప్రయత్నించింది. వెంటనే కేకలు వేస్తూ ఆటో నుంచి దూకేందుకు ప్రయత్నించగా వాహనదారులు ఆటోను ఆపి విషయం తెలుసుకున్నారు. వెంటనే అక్కడి స్థానికులు సంధ్య భర్త రాజేష్‌కు ఫోన్ చేసి పిలిపించడంతో ఆటో డ్రైవర్ భద్రు, సంధ్య తల్లి విజయ పారిపోయారు. బాధితురాలు సంధ్య ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేస్తామని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఘనంగా ఊంజల్ సేవ



యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్: శ్రీరుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని ఆలయంలో సోమవారం రాత్రి స్వామి వారి 'ఊంజల్ సేవ'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ గర్భగుడిలో శోభాయమానంగా అలంకరించిన ఊయలలో వేణుగోపాలస్వామి వారు అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు.